'ప్రాసెస్'... పనితీరు ఏదీ!

ప్రాసెసింగ్ యూనిట్లు పనితీరు సరిగా లేక గిరిజన రైతులు నష్టపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారి ఉత్పత్తుల విక్రయానికి దళారీలను ఆశ్రయించే పరిస్థితులు నెలకొన్నాయి.

- రూ.కోటి వెచ్చించారు.. గాలికొదిలేశారు..
- జీడి యూనిట్లు ప్రారంభానికే పరిమితం
- చింతపండు ప్రాసెసింగ్‌ది అదే దారి
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- నిదరోతున్న వీడీవీకే జీడి కేంద్రాలు
- వైకేపీ పర్యవేక్షణ అంతంతమాత్రమే..


జిల్లేడుపాడులో మూతపడిన జీడిపప్పు తయారీ కేంద్రం


ఇటీవల ఏర్పాటు చేసిన వీడీవీకే జీడి ప్రాసెసింగ్ కేంద్రంలో యంత్రాలు

సీతంపేట: సీతంపేట మన్యంలో వైకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ రకాల ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టినా చెప్పుకోదగ్గ పనితీరు లేదు. దీంతో గిరిజనోత్పత్తులకు సరైన మార్కెటింగ్ లేక దళారీలే శరణ్యమనే పరిస్థితి దాపురిస్తుంది. గిరిజన ప్రధాన ఆదాయ వనరులు చింతపండు, జీడి పంటలు. వీటిని పండించే రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలనేది ఐటీడీఏ ఆశయం. తద్వారా గిరిజనుల జీవనోపాదులు మెరుగుపర్చాలనేది లక్ష్యం. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో దీనికి భిన్నంగా ఉంది. వైకేపీ ఆధ్వర్యంలో ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పి తద్వారా ఆదాయ వనరులు మహిళా సంఘాలకు పెంచేలా చర్యలు తీసుకున్నారు. సీజన్‌లో చింతపండు కొనుగోలు చేసి ప్రాసెస్ చేసి నాణ్యమైన చింతపండును పిక్కతీసి ప్యాకెట్ల రూపంలో తయారు చేసి వసతిగృహాలు, ఇతర మార్కెటింగ్ కేంద్రాలకు విక్రయించాలని గతంలో నిర్ణయించారు. వీటికి సంబంధించిన యంత్రాలను కూడా కొనుగోలు చేశారు. భవన సదుపాయాలు ఏర్పాటు చేసి అక్కడ యంత్రాలను ఏర్పాటు చేశారు. ఐటీడీఏకు కూత వేటు దూరంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం గత కొన్నేళ్లుగా మూతపడి ఉంది.

వీడీవీకేల యూనిట్లు పరిస్థితి అంతే..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 7 జీడి ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీడీవీకే (వన్ ధన్ వికాస్ కేంద్రం) ద్వారా 300ల మంది సభ్యులతో ఒక్కో జీడి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జీడి పిక్కలు కొనుగోలు చేసి పప్పు తయారు చేసి మార్కెటింగ్ చేయాల్సి ఉంది. వచ్చిన ఆదాయాన్ని అందరూ పంచుకోవాల్సి ఉంది. జీడి కొనుగోలు చేసి వాటికి మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడానికి వీలుగా యంత్రాలు దాదాపు రూ.15 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఇలా 7 యూనిట్లకు రూ.కోటి వరకు వెచ్చించినా ఫలితం లేదు. జీడి పిక్కలు కొనుగోలు చేయించి యంత్రాల ద్వారా పప్పును తయారు చేసి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే ఆదాయం వచ్చేది. అటువంటి చర్యలు లేవు. గతంలో శంభాంలో కూడా ఈ తరహాలోనే ప్రాసెసింగ్ కేంద్రాన్ని నెలకొల్పారు. గత కొంతకాలం నడిపారు. మహిళా సంఘాలు ప్రాసెస్ చేసి జీడిపిక్కలు తీసినప్పటికీ సరైన మార్కెట్ లేక పోవడంతో నష్టాలు చవిచూసే పరిస్థితి ఏర్పడింది. దీంతో కేంద్రం తెరుచుకోలేదు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మార్కెటింగ్ కేంద్రాలు మూసివేశారు. ఐటీడీఏ ప్రాంగణంలో ఈ సంవత్సరం వీడీవీకే ఆధ్వర్యంలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి ఇంతవరకు తెరుచుకోకపోవడం గమనార్హం. చింతపండు సీజన్ ఇక ముగిసిపోతుంది. ఇప్పటికీ ఈ యూనిట్ తెరుచుకోకపోవడం గమనార్హం. స్థానికంగా ఐటీడీఏకు సమీపంలో ఈ కేంద్రాలు నెలకొల్పినప్పటికీ ఫలితం లేదు.

ఎవరో వస్తే ఒకే...

రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు, మంత్రులు, ఇతర ముఖ్యమైన వారు వచ్చినప్పుడు మాత్రమే జీడి ప్రాసెసింగ్ కేంద్రాలు తెరుస్తారు. తర్వాత మళ్లీ మూసి వేస్తారని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

జీడీ పప్పుగా విక్రయించుకోవాలి..



రైతులు జీడి పిక్కలను జీడి ప్రాసెసింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి వాటిని పప్పు తయారు చేసి బయట మార్కెట్లో విక్రయించుకోవచ్చు. కేవలం విద్యుత్ బిల్లు నామమాత్రపు రుసుము చెల్లిస్తే సరిపోతుంది. పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి జీడి పప్పు తయారు చేయాలంటే కష్టసాధ్యమైన పని. సీతంపేట మండలంలో కల్లంగూడలో ఈ విధంగా జీడిపప్పు తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నారు.

– ఆర్.వెంకటరమణ, ఏపీడీ, వైకేపీ

వీడీవీకేలకు తగిన ప్రోత్సాహమివ్వాలి



వీడీవీకేలకు తగిన ప్రోత్సాహమివ్వాలి. ఈ సీజన్‌లో జీడి యూనిట్లు సక్రమంగా పనిచేసే విధంగా చూడాలి. ఐటీడీఏ పరంగా జీడి పిక్కలు కొనుగోలు చేసి ఇక్కడ ప్రాసెస్ చేసే విధంగా చేస్తే బాగుంటుంది. ఈ పంటలే ప్రధాన ఆదాయ వనరు. దీని ద్వారా మా సభ్యులకు ఉపాధి కల్పించేలా చూడాలి.

– ఎస్.రమేష్, ముత్యాలు గ్రామం, ఎఫ్‌పీఓ ప్రెసిడెంట్

ఏజెన్సీలో చింతపండు సుమారు 5 వేల హెక్టార్లలో, జీడి 20 హెక్టార్లలో సాగులో ఉండగా గిట్టుబాటు ధరలు పూర్తి స్థాయిలో లేవు. దీంతో రైతులు దళారీలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడు కిలో జీడి కేవలం రూ.94కి మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాటు తూకాల్లో కూడా మోసాలు తప్పడం లేదు.

క్లుప్తంగా

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


గురుకుల బాలికల పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సీతంపేట: గిరిజన గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి 6 నుంచి 9 తరగతుల మిగులు సీట్ల కోసం ఆదివారం స్థానిక బాలురు, బాలికల గిరిజన గురుకుల పాఠశాలల్లో రాతపరీక్ష ఆదివారం నిర్వహించారు. మొత్తం 550 మంది విద్యార్థులకుగాను 63 మంది గైర్హాజరయ్యారు. 487 మంది హాజరైనట్టు గురుకులం సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు తెలిపారు.

హిల్ ట్రెక్కింగ్


కొండ శిఖరంపై యువత

సీతంపేట: యువ క్లబ్ కో ఆర్డినేటర్ గీతా శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం 12 మంది యువకులు దిగువముల్లెలుగూడ కొండపై హిల్ ట్రెక్కింగ్ చేశారు. కొండ శిఖరం వరకు ఎక్కి ఆనందించారు. కార్యక్రమంలో స్థానిక గిరిజన యువత, జేసీఐ ప్రెసిడెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన తప్పెటగుళ్ల ప్రదర్శన


తప్పెడగుళ్ల ప్రదర్శన

భామిని: గ్రామీణ జానపదాలు అంతరించిపోతున్న వేళ అప్పడప్పుడు తప్పెటగుళ్ల ప్రదర్శనలు గుండె నిండా ఆనందం నింపుతున్నాయి. భామిని మండలం నేరడి బీలో తప్పెటగుళ్ల ఆటగాళ్లు ఆదివారం ఆట, పాటలతో అలరించారు. శనివారం నుంచి గ్రామంలో బెండి కుటుంబాలు చేపట్టిన ఇంటి దేవత పండుగల్లో పాల్గొని ఆకట్టుకున్నారు.

వంశధారలో పెరిగిన నీటి ప్రవాహం


వంశదార నదిలో కాలినడకన ప్రయాణికులు

భామిని: మండలానికి ఒడిశాలకు మధ్య హద్దుగా ప్రవహిస్తున్న వంశధార నదిలో ఆదివారం కాస్త నీటి ప్రవాహం పెరిగింది. అకాల వర్షంతో ఒడిశా ఎగువ ప్రాంతంలో వర్షాల ప్రభావంతో నీటి మట్టం కొద్దిగా పెరిగి వాహన రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీ


బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎస్సై కె.నీలకంఠం అన్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర రహదారిలో సువర్ణముఖినదిపై ఉన్న వంతెన వద్ద ఆయన ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రహదారిపై రాత్రిపూట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున వాహన చోదకు లకు అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరిస్తున్నామన్నారు. అలాగే వాహనం నడపడానికి లైసెన్స్ లేకుండా, చిన్న పిల్లలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఉన్నతాధికారులు గుర్తించి వాహనాలను తరచూ తనిఖీ చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేశారన్నారు. దీంతో వాహనాలు తనిఖీ చేయడం, ప్రభుత్వానికి బాకీ ఉన్న అపరాధ రుసుం చెల్లించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే వాహనాల్లో అధిక లోడ్, మితి మీరిన వేగం వల్ల వచ్చే అనర్థాలు వివరిస్తున్నట్లు చెప్పారు. వాహన చోదకులు విధిగా వాహన చట్టాలపై అవగాహన కల్పించుకుని రోడ్డుపై వాహనాలు నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నాద నీరాజనం


వేణుగోపాలస్వామి ఆలయంలో నాద నీరాజనం

రాజాం సిటీ: స్థానిక రాజవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం వాసవీక్లబ్ వనితకాంతి కిట్టి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నాద నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులచే నృత్య ప్రదర్శన, నాద నీరాజనం జరిపారు. అనంతరం పలువురికి సత్కరించారు. కార్యక్రమంలో కాంతికిట్టి సభ్యులు కొల్లా శాంతి, వి.ఝాన్సీ, హెచ్.సుబ్బలక్ష్మి, ఎం.కృష్ణవేణి, కె.ప్రశాంతి, కె.రోజా, విద్యార్థులు పాల్గొన్నారు.

నష్ట నివారణపై దృష్టి పెట్టాలి

పాలకొండ రూరల్: అకాల వర్షాల కారణంగా నష్టపోతున్న మామిడి రైతులు నష్ట నివారణా చర్యలపై అవగాహన పెంచుకోవాలని ఉద్యానవ శాఖాధికారిణి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలో భారీ వర్షం కురువటంతో సంబంధిత రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత వర్షాలకు కాయ పురుగు పట్టకుండా ఉండేందుకు లీటరు నీటికి డైమిథోమేట్ 2 మిల్లీలు లేదా క్లోరి ఫైరిపాస్ 2.5 మిల్లీలు వంతున కలిపి పిచికారీ చేయాలన్నారు. చెట్లు త్వరగా కోలుకునేందుకు పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, బొరాక్స్ 1.25 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయటం శ్రేయస్కరమన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పండ్లను వీలైనంత త్వరగా కోసుకోవాలన్నారు. రాలిన పండ్లను వెంటనే ఏరి శుభ్రం చేసి మార్కెట్‌కు చేర్చటం మంచిదన్నారు. ఒరిగిన, పడిపోయిన చెట్లను ఎత్తిపెట్టి, మట్టిని ఎగదోయాలన్నారు. విరిగిన కొమ్మలను కత్తిరించి, పైభాగంలో బోర్డో పేస్ట్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను పూతగా పూయాలన్నారు. ఒక్కో చెట్టుకు 5 వందల గ్రాముల యూరియా, 417 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 25 కిలోల పశువుల ఎరువులు వేయాలన్నారు. వేరు తెగులు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలపి మొదళ్ల వద్ద తడపాలన్నారు. పక్షి కన్ను, పండు కుళ్లు తెగుళ్ల నివారణకు కార్బండిజమ్ 1 గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

మోచా ప్రభావంతో ఈదురుగాలులు


వీస్తున్న ఈదురు గాలులు

భామిని: మోచా వాయుగుండం ప్రభావంతో ఆదివారం ఈదురు గాలులు వీచాయి. అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి ఉక్కపోతతో అవస్థలు పడిన ప్రజలు వీచిన గాలులతో ఉపశమనం పొందారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం తగ్గిందనే సమాచారంతో రైతులు ఊరట చెందారు.

సీతంపేటలో భారీ వర్షం

సీతంపేట: సీతంపేటలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. అక్కడక్కడ వడగండ్ల వర్షం కురిసిందని పలు గ్రామాల గిరిజనులు తెలిపారు. కొండపోడు వ్యవసాయంలో పలు చిరుధాన్యాల పంటలు, వేసవి దుక్కులకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

ఘనంగా అల్లూరి వర్ధంతి


కొమరాడ: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం శ్రేణులు

గరుగుబిల్లి: మన్యం వీరుడు అల్లూరి సీతారాంరాజు వర్ధంతిని మండలంలోని నాగూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ వారి దోపిడి నుండి విముక్తి కలిగించేందుకు అల్లూరి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సాయుధ పోరాటం కారణంగానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి ప్రాణాలర్పించారన్నారు. కార్యక్రమంలో మధుసూదనరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొమరాడ: మండల కేంద్రంలో సీపీఎం నాయకులు కొల్లు సాంబమూర్తి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వం దోపిడీ, నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసి మన జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక తరగతులు

వేపాడ: మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో ఉపాధ్యాయులు ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ తరగతులకు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే వారంతా రావాలని కోరారు.

వేతనాల చెల్లింపు


గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ రాజు, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని బిల్లుమడ పంచాయతీలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఆదివారం వేతనాలు అందజేశారు. సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ, కార్యదర్శి అనసూయల సూచనలతో మాజీ సర్పంచ్ సిగడాన రాజు స్వచ్ఛత కార్మికుల వేతనాలు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహిళల కోలాటం

వీరఘట్టం: పైడితల్లి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా స్థానిక మహిళలు అమ్మవారి సన్నిధిలో తమ నృత్యాలను ఆదివారం ప్రదర్శించారు. అనంతరం ఉయ్యాల – కంబాల కట్టిన చోట భక్తి గీతాలకు నృత్యాలు చేశారు. వీరందరూ స్థానికులు కావడంతో వీరి ప్రదర్శిన తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

వాహన చోదకులు నియమాలు పాటించాలి

బలిజిపేట: మండలంలోని తుమరాడ, మిర్తివలస, బర్లి గ్రామాలల్లో సోమ, మంగళ, బుధవారాల్లో జరగనున్న గ్రామదేవతల ఉత్సవాల సందర్భంగా వాహనచోదకులు, వాహనదారులు తప్పకుండా పోలీస్‌శాఖ నిర్ధారించిన నియమాలను పాటించాలని ఎస్సై ప్రశాంత్‌కుమార్ కోరారు. వాహనదారులు వాహనాలను గ్రామాల సరిహద్దుల్లో కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే ఉంచాలని సూచించారు.

మంచినీటి పైప్‌లైనుకు మరమ్మతులు

సీతానగరం: పెదభోగిలిలో మంచినీరు సరఫరా చేయాల్సిన పైప్‌లకు పంచాయతీ ఈఓ జె.వెంకటరావు ఆదివారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అమ్మవారి జాతరను పురస్కరించుకుని ప్రజలకు తాగునీరు సమృద్ధిగా సరఫరా చేయాలని సర్పంచ్ జె.తేరేజమ్మ సూచించిన నేపథ్యంలో ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి వీధి కుళాయిలకు తాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు.

జీడి రైతులకు మేలు చేకూర్చేలా చర్యలు


అడ్డాకుల చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: ఉద్యాన పంట జీడిమామిడికి కనీస మద్దతు ధర ప్రకటించాలని గుమ్మలక్ష్మీపురం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు కోరారు. ఆదివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యాన పంటలు మామిడి, అరటి, బత్తాయి, ఆయిల్ పామ్, పసుపు, మిర్చి క్వింటాళ్లకు మద్దతు ధర ప్రకటించిందని, ఈ మేరకు రైతులకు మేలు చేకూరుతోందన్నారు. రైతులు, పంటలకు మద్దతు ధర, కొనుగోలు ప్రక్రియను ముమ్మరంగా ముందుకు తీసుకెళ్లాలని, పర్యవేక్షణ నిశితంగా జరగాలని వెరసి అకాల వర్షాల నేపథ్యంలో అన్నదాతలకు అండగా ఉండాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశిస్తున్నా, క్షేత్ర స్థాయిలో అధికార యంత్రాంగానికి పట్టినట్లు లేదని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలలో జీడిమామిడి ప్రధాన ఆర్థిక వనరు గల పంటన్నారు. గడిచిన రెండేళ్లుగా వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా పంట కాపునకు రాక, నష్టపోగా... ఈ ఏడాదైనా కాస్త లబ్ధి పొందవచ్చని ఆశించిన జీడి రైతులకు నిరాశే మిగిలిందన్నారు. కనీస మద్దతు ధర ప్రకటించి, మార్క్‌ఫెడ్ లేదా ఐటీడీఏ వంటి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేపట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సర్పంచ్ ఇందుమతి తదితరులు

గరుగుబిల్లి: గ్రంథాలయ శాఖ ద్వారా సోమవారం నుండి నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కె.ఇందుమతి అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో వున్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం నుండి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడలు, పోటీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులను ఇవ్వనున్నట్టు తెలిపారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న ఇరు జట్లు

వీరఘట్టం: గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మొత్తం 28 టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనగా ఇంత వరకు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు.

ఆదివారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. సోమవారం ఉదయం సెమీస్ అనంతరం సాయంత్ర ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కురుపాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2023 – 24 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుందరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ద్వారా అందించే నాణ్యమైన ఉచిత విద్య ఆంగ్ల మాధ్యమంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదవటానికి 5వ తరగతి చదివిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 9వ తేదీ నుంచి 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ/ఎస్టీలకు రూ.75, ఓసీ/బీసీలకు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్లో హెచ్‌టిటిపిఎస్ : ఏపిఎంఎస్.ఏపి.జిఓటి.ఇన్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించండి

- పోలీస్ సిబ్బందికి డీఎస్పీ సూచన


పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ కిషోర్‌వర్మ

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆదివారం పోలీస్ సిబ్బందికి ప్రత్యేక విధులను అప్పగించారు. అమ్మవారి పండుగకు బందోబస్తుగా వచ్చిన 116 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి కోవెల వద్ద, ట్రాఫిక్ వద్ద, ప్రధాన రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే స్టేజి వద్ద ప్రశాంత వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీధుల్లో అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలని మరికొంతమంది సిబ్బందికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అనంతరం సీఐ మురళీధర్ సిరిమాను రూట్ మ్యాపును వివరించారు. ఎస్ఐలు కిషోర్‌వర్మ, అనీష్‌లతో కలిసి వీరఘట్టం వీధుల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.

నేత్ర పర్వంగా ఉయ్యాల - కంబాల


అమ్మవారి ఉయ్యాల - కంబాల ఉత్సవానికి పోటెత్తిన భక్తులు

- పోటెత్తిన భక్త జనం
- తోపులాటలో పలువురు మహిళలకు స్వల్ప గాయాలు

వీరఘట్టం: ఏడేళ్ల తర్వాత జరుగుతున్న వీరఘట్టం గ్రామదేవత పండగ మహోత్సవాలు చివరి ఘట్టానికి చేరుకుంటున్నాయి. అమ్మవారి ఉత్సవాల్లో ప్రధానమైన ఉయ్యాల – కంబాల మహోత్సవం ఆదివారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. ప్రధాన రహదారిలో కూర్మనాథ్ ఆస్పత్రికి సమీపంలో ఏర్పాటు చేసిన ఉయ్యాల-కంబాల ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. సాంప్రదాయం ప్రకారం తొలుత బార్నాల వంశీకులకు చెందిన బార్నాల చంద్రమౌళి ఈ ఉయ్యాలను ఊగి ఉత్సవాన్ని ప్రారంభించారు. తర్వాత బోయిడు ఇంటి నుండి బయలుదేరిన అమ్మవారి ఘటాలు ఉయ్యాల – కంబాల వద్దకు చేరుకొని ఉయ్యాల ఊగగా భక్తులు ఈ ఘటాలకు పూజలు చేశారు.

పోటెత్తిన భక్తజనం

నేత్రపర్వంగా జరిగిన ఉయ్యాల – కంబాల దృశ్యాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. వీరిని ఆపడం ఎవరితరం కాలేదు. భక్తులను కంట్రోల్ చేయడంలో పోలీస్ సిబ్బంది విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 120 మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన పోలీస్ అధికారులు ఆ దిశగా బందోబస్తును పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉయ్యాల – కంబాల ఉత్సవం దగ్గర ప్రణాళిక ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేయకపోవడంతో కొద్దిగా తోపులాట జరిగి పలువురు మహిళలు కిందపడిపోయారు. ఇంకొందరు జనసందోహాన్ని చూసి వెనుదిరిగారు. అమ్మవారి పండుగ ఈ నెల 10తో ముగియనుంది. సుమారు లక్షకు పైబడి భక్తులు రానున్నారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయకపోతే ఇబ్బందులు తప్పేటట్లు లేవని స్థానికులు చెబుతున్నారు.